# విప్లవం వర్ధిల్లాలి!

"విప్లవం వర్ధిల్లాలి"

కుర్చీలోంచి అమాంతం లేచి, ఎర్రగా జేవురించిన మొహాన్ని సీలింగ్‌కేసి తిప్పి గుప్పిళ్ళు బిగించిన చేతుల్ని పైకి విసురుతూ, సాంబయ్య ఇలా అరిచేటప్పటికి చుట్టూ కొలువు తీర్చి ఉన్న అతని పార్టనర్స్ ముగ్గురూ ఒక్కసారిగా హడలిపోయారు.

"ఏవిటా మతిలేని అరుపు?" అంటూ విసుగ్గా చూశాడు రాఘవరావు, నోట్లో వేసుకోబోతూఉన్న జీడిపప్పు పలుకుని చేత్తో ఆ మట్టునే పట్టుకుని ఉండిపోయి.

"ఇది ఎవరో పూటకిగతిలేని దరిద్రులూ రోడ్లమ్మట ఉల్ఫాగా తిరిగే దౌర్భాగ్యులూ వేసే పిచ్చికేక! నీ ఖర్మేం కాలింది? ఏడాది తిరిగేటప్పటికి మాతో పాటు ఫ్యాక్టరీ లాభంకింద పదేసి వేలు పంచుకుంటున్నావు. అదికాక, ఎవరికీ దమ్మిడీ వాటా ఇవ్వక్కర్లేని నీ కంట్రాక్టులు ఏవో నీకు ఉండనే ఉన్నాయి. హమేషా పాతిక ముప్పై వేలు రెడీ కేష్‌నీ, పదిహేను లారీలనీ, పదిమంది రౌడీలనీ, అయిదారుగురు కిరాయి ఆడవాళ్ళనీ, ఇద్దరు ముగ్గురు జిల్లా అధికార్లనీ నీ చేతిలో తిప్పుకుంటూ ఉన్నావాయెను. అలాంటి దర్జా పురుషుడివి నువ్వేమిటి, ఈ దరిద్రపు కేక వెయ్యడమేమిటి? ఛత్!" అంటూ రంగనాథం సాంబయ్య కేసి కొరకొరా చూసి గ్లాసులో మిగిలిన కాస్త "వేట్"నీ గుటుక్కున కోపంతో మింగాడు ఒక్క గుటకలో.

"నిత్యం వర్కర్లు అరిచే అరుపు చెవిలో పడి పడి చివరికి సాంబయ్య గుండె చెదిరిపోయింది కాబోలు, హ ..... హ ..... హ ....." అంటూ మహాలింగం లేచి, పంచె ఓమారు బిగించుకొని మళ్ళీ కూచున్నాడు.

"మన గది చుట్టూ బయట నిలబడి ఘెరావ్ చేస్తూన్న ఆ వర్కర్ల నాయకుణ్ణి ఇలా రమ్మని పిలవండి".

ఉలిక్కిపడ్డారు తక్కిన ముగ్గురూ.

"అనుమానంలేదు, ఇతనికి పూర్తిగా మతిపోయింది" అనుకున్నారు.

ఒళ్ళెవ్వూ కదలలేదు. ముగ్గురికేసీ చూశాడు సాంబయ్య. తల పంకించాడు. "సరే!" అని తనే లేచాడు.

"సాంబయ్యా మా మాట విను. పోలీసులకి ఫోను చేశావుకదా! వాళ్ళు వచ్చేదాకా తలుపులు తెరవరు. గుంపు మాంచి ఉద్రేకంలో ఉంది".

ముగ్గురి చేతుల్నీ విదిలించి తలుపు తెరిచేశాడు.

ఒక్కమాటుగా లోపలికి చొచ్చుకుంటూ వినిపించింది సముద్రంలాంటి ఘోష.

ముందుకీ, వెనక్కీ తోసుకుంటూ కెరటాల్లా జనం!

ఉండుండి సాంబయ్యకి ఇటూ అటూ తలుపుమీదా, గోడమీదా టప్ టప్ మంటూ వచ్చి పడుతున్నాయి కంకరరాళ్ళు.

సాంబయ్య ఏం తొణకలేదు. గంభీరంగా నిలబడి గుప్పిడి బిగించి గాలిలో చేతిని కదిలిస్తూ గట్టిగా మళ్ళీ అరిచాడు "విప్లవం వర్ధిల్లాలి" అంటూ.

బ్రహ్మాండమైన ఆ కోలాహలంలో అతని చెయ్యి మాత్రం అందరికీ కనిపించింది. అన్న మాట మాత్రం ఏ కొందరికోకాని వినిపించలేదు. విన్న ఆ కొద్ది మందీ "అరే – ఈ సాంబయ్య ప్లేటు ఫిరాయించాడే! ఇతనూ విప్లవమే కావాలంటున్నాడేమిటి? బహుశా ఇతని విప్లవం వేరే రకం అయివుంటుంది. యిదేదో ఖరీదైన విప్లవం కాబోలు" అంటూ నవ్వుకున్నారు.

కాని సాంబయ్య పక్కనే నిలబడిన వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంటు సూరిబాబు మాత్రం నవ్వలేదు. ఆ మాట సాంబయ్య ఆషామాషీగా అన్నట్టనిపించలేదు అతనికి. అందుకే వర్కర్లవేపు తిరిగి చేతులూపుతూ "ఆగండి!" అంటూ గట్టిగా అరిచాడు.

దాంతో కేకలూ, అల్లరీ ఆగింది.

అంతా సర్దుమణుగుతున్న సమయంలో వెనక నుంచి ఓ చిన్న రాయి వచ్చి సాంబయ్య నుదుటికి తగిలి చర్మం కొద్దిగా చిట్లింది.

"తక్కిన ముగ్గురూ లోపలినుంచి రారేం?" అంటూ ఎవరో అరిచారు గుంపులోంచి.

"సోదరులారా ఆగండి! సాంబయ్య గారిలో ఏదోమార్పు వచ్చినట్లుంది, ఆయన కూడా విప్లవం వర్ధిల్లాలి అంటున్నారు" అన్నాడు సూరిబాబు.

"అంతా నాటకం! నమ్మొద్దు!" అంటూ అరిచాడు వెనకనుంచి ఎవరో వర్కరు.

ఇంతలో లాఠీలతో, మనుష్యుల మధ్యనుంచి దారిచేసుకుంటూ ఏడెన మందుగురు పోలీసులతో సబ్ఇన్స్పెక్టరు ముందుకు వచ్చి, సాంబయ్యకి శాల్యూట్ చేసి నిలబడ్డాడు.

"చూశారా! ఓ పక్కనుంచి మనల్ని కొట్టించడానికి పోలీసుల్ని పిలిపించి, మరో పక్కనుంచి మంచిగా ఉన్నట్లు నటిస్తున్నాడు" – గుంపు లోంచి అరుపు.

మళ్ళీ కలకలం – అల్లరి.

సాంబయ్య వెంటనే సబ్ఇన్స్పెక్టరుతో "మా వాళ్ళెవరో పొరబాటున మీకు ఫోను చేసిఉంటారు. సారీ, మీరు వెళ్ళండి. మాలో మేం సర్దుకుంటాం" అన్నాడు.

కాస్సేపు తటపటాయించి, "సరే అయితే" అంటూ శాల్యూట్ చేసి పోలీసులతో వెళ్ళిపోయాడు ఇన్స్పెక్టర్, వర్కర్లంతా ఏం అర్థంకాక మతులు పోయి ఆ మట్టునే చూస్తూ ఉండిపోయారు.

నిశ్శబ్దంగా బొమ్మలా నిలబడిఉన్న వర్కర్ల నుద్దేశించి కంఠంలో సానుభూతి కనబరుస్తూ "మీ ఆవేదన నాకు అర్థం అయింది. మీ కోరిక లేవిటో ఓ కాగితం మీద రాసి, సంప్రదింపుల కోసం మీ ప్రతినిధుల్ని పంపించండి. వీలైనంత వరకూ మీ కోరికలు తీరుస్తాను. నన్ను నమ్మండి" అంటూ చేతులు జోడించి నిలబడ్డాడు సాంబయ్య.

"కాలయాపన కోసం ఇదో నాటకంరా" అన్నారు కొందరు.

"ఏమో నిజమేమో" అన్నారు మరికొందరు.

మొత్తంమీద అంతా సందిగ్ధంలో పడ్డారు. ఎటూ తేల్చుకోలేక, సాయంత్రానికి ఏదో ఒకటి నిర్ణయించుకొని, ప్రతినిధుల్ని పంపిస్తాం అంటూ వర్కర్లంతా నెమ్మదిగా అక్కడనుంచి కదిలారు ఒక్కొక్కళ్ళే.

సాంబయ్య లోపలికి వచ్చి "ఉష్" మంటూ కుర్చీలో కూర్చోబోతుంటే. "ఏమిటి నువ్వు చేసిన పని?" అన్నాడు రాఘవరావు నిష్ఠూరంగా.

"ఇంకా నువ్వేదో పెద్ద ధైర్యవంతుడివి అనుకున్నాను నేను" అన్నాడు రంగనాథం వ్యంగ్యంగా.

"ఇలా చేస్తే ఇంకేమైనా ఉందా? ఇది అలుసుగా తీసుకుని రేపొద్దున్న నెత్తి కెక్కరూ?" అంటూ 'ఏం అంతేకదూ?' అన్నట్టు తక్కిన ఇద్దరికేసీ చూశాడు మహాలింగం.

సాంబయ్య వాళ్ళ ముగ్గురి కేసీ చూసి. గోల్డ్‌ఫ్లాక్ ముట్టించి, ఓ దమ్ము లాగి చేత్తో పట్టుకొని, కాలుతూన్న ఆ చివరి భాగాన్ని చూస్తూ "నేను అంతా ఆలోచించే చేశాను. నా మీద నమ్మకం ఉంటే ఈ సమస్యని పరిష్కరించడం ఎలాగో నాకు వదిలెయ్యండి ........ లేదంటారూ ........" అంటూ ఆ వాక్యాన్ని పూర్తి చెయ్యకుండా కంటి చివరనుంచి వాళ్ళ ముగ్గురి మొహాల్లోకీ చూశాడు.

ముగ్గురూ వెంటనే కంగారుగా "అహ! అబ్బే! అదేంకాదు. ఊరికే ..... ఏం అవుతుందో అని అన్నాం. అంతే. సరే–నీకు ఏది మంచిదనితోస్తే అలాగే చెయ్యి. ఐనా నీకంటే తెలుసా మాకు!" అంటూ తడబడుతూ నీళ్ళు నమిలారు.

ఆ సాయంత్రం, వచ్చిన ప్రతినిధులికి డ్రింకులిచ్చి, వాళ్ళు "సిప్" చేస్తూంటే చేతివేళ్ళకేసి చూసుకుంటూ "మీ జీతాలూ పెంచవలసిందే, బోనస్ కూడా ఇవ్వవలసిందే – ఏనాడో చెయ్యవలసిన పనులు ఇవి రెండూ. గవర్నమెంటు కనక చెయ్యనిస్తే..." అన్నాడు సాంబయ్య.

"గవర్నమెంటు మిమ్మల్ని చెయ్యొద్దు అందా?" వ్యంగ్యంగా అడిగాడు సూరిబాబు. వెంటనే సాంబయ్య అతనికేసి చూసి నవ్వి "నోటితో అనలేదనుకో. కాని చేసే అవకాశమే ఇవ్వలేదు. అంతే" అన్నాడు. కాస్సేపు ఆగి, "మీకు ఏం ఇవ్వాలన్నా చేతిలో డబ్బు ఉండాలికదా? గోడౌన్‌లో వందలకొద్దీ ఉండిపోయిన ఆ పంచదార బస్తాలు అమ్మితేకాని డబ్బు ఎలా వస్తుందీ?" అన్నాడు.

"అయితే అమ్మెయ్యండీ!" అన్నాడు ఓ ప్రతినిధి.

సాంబయ్య నవ్వి "గవర్నమెంటు దగ్గర్నుంచి ఆర్డరు వస్తేనేకాని అమ్మడానికి వీలులేదు అంటున్నారు మన ఫేక్టరీ ఇన్‌స్పెక్టరుగారు. మన అవసరంకంటే, ఆయన మాట ముఖ్యంకదా?" అన్నాడు.

"ఏం ముఖ్యంకాదు. రేపు గోడౌనులోంచి బస్తాలు తియ్యండి. ఎవరు అడ్డుకుంటారో చూస్తాం" అన్నారు ప్రతినిధులంతా ఏక కంఠంతో.

మర్నాడు "ఏమిటండీ ఈ అన్యాయం. ఇలా బెదిరించి గోడౌనులో పంచదార బస్తాలన్నీ లారీలకి ఎత్తుతున్నారీ వర్కర్లు? అనక గవర్నమెంటు దగ్గర్నుంచి నాకు

మాట రాదూ?" అన్న ఎక్సైజు ఇన్‌స్పెక్టరుతో "ఏం చెయ్యమంటారు సార్! నన్నూ అలాగే దౌర్జన్యంతో భయపెట్టారు. సరే కానియ్యండి. రోజులు వాళ్ళవి. ఏం చేస్తాం?" అన్నాడు సాంబయ్య.

రాత్రి పదిన్నర అయేటప్పటికి చెక్‌పోస్టు దగ్గర సేల్స్‌టాక్సు వాళ్ళు లారీల్ని ఆపేశారని కబురు వచ్చింది. వెంటనే సాంబయ్య కార్మిక నాయకులికి కబురు చేసి "ఏం చేద్దాం? ఓ వెయ్యి రూపాయల్ని లంచం ఇస్తే, వాళ్ళా పాతిక లారీల్నీ వదుల్తారు కాబోలు! వర్కర్ల కేదో సాయం చేద్దాం అని నేననుకుంటే వీళ్ళొకళ్ళు మధ్యన సైంధవుల్లాగ" అన్నాడు.

"వాళ్ళకి లంచం ఇచ్చేదేవిటి సార్! లారీల్ని ఎందుకు వదలరో ఎలా వదలరో అదీ చూస్తాం" అంటూ హూంకరించాడు ఒక ప్రతినిధి.

"అయినా ఎందుకేనా మంచిది ఈ రెండు వందలూ దగ్గరుంచండి" అంటూ సాంబయ్య రెండు పెద్దనోట్లు తీసి వాళ్ళచేతిలో పెట్టాడు.

రాత్రి చెక్ పోస్టు పాక అంటించేశారనీ, చెకింగ్ ఆఫీసరుమీదా, బంట్రోతు మీదా దౌర్జన్యం సాగించారనీ, నేరారోపణ చేస్తూ అనుమానంమీద సూరిబాబునీ, మరో నలుగురు నాయకుల్నీ పోలీసువారు కస్టడీలోకి తీసుకున్నారు.

ఆ సాయంత్రమే వర్కర్లందర్నీ ఉద్దేశించి బాధవల్ల వణుకుతూన్న కంఠంతో "మన సూరిబాబునీ వాళ్ళనీ అన్యాయంగా పోలీసులు అరెస్టు చేశారు. నేను జామీను ఇస్తాను విడుదల చెయ్యండి అని అడిగితే జామీనుమీద విడుదల చెయ్యడానికి వీలు లేదని పైనుంచి ఆర్డర్సు వచ్చాయన్నారు. సరే ఏంచేస్తాం? పాపం వాళ్ళ కుటుంబాలు ఏం కష్టాల్లో ఉన్నాయో ఏమో, ఈ డబ్బు పట్టుకెళ్ళి వాళ్ళకివ్వండి" అంటూ పైమీద కండువాతో కళ్ళు ఒత్తుకున్నాడు సాంబయ్య. ఆ దృశ్యం చూసేసరికి వర్కర్ల హృదయాలు కదిలిపోయాయి. బాధతో ఊగిపోయారు. దార్లో దొరికిన కంకరరాళ్ళనీ, షోడాబుడ్లనీ తీసుకుని అంతా పోలీసుస్టేషన్ మీదపడ్డారు. ఇద్దరు ముగ్గురు పోలీసువాళ్ళకి రాళ్ళదెబ్బలు తగలడంతో పోలీసులు చేరిన గుంపుని లాఠీలతో చెదర గొట్టాలని చూశారు. ఆ ప్రయత్నంలో అయిదారుగురు వర్కర్ల తలలు పగిలి, రోడ్డంతా రక్తపు మడుగు అయిపోయింది.

తోటివాళ్ళ రక్తం చూసేసరికి తక్కినవాళ్ళ రక్తం కోపంతో ఉబికింది. దానికి, ఊళ్ళో అన్యాయం ఓర్చలేని మరికొందరి ఉద్రేకం తోడయింది. జనం పట్టలేని ఆవేశంతో ఊగిపోతూ, గవర్నమెంటు ఆఫీసుల మీదకి ఎగబడ్డారు. ఆ సమయంలో

సాంబయ్య వాళ్ళని ఎంతో శాంతపరచాలని చూశాడు. "ఉదాహరణకి ఈ బిల్డింగ్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరు వారి ఆఫీసు మనల్నేం చేసింది? దీన్ని మనం ఎందుకు తగలబెట్టడం" అన్నాడు.

"వీల్లేదు. అది తగలబెట్టాల్సిందే" అంటూ గుంపులోంచి ఎవరో అరిచారు. అంతే – ఆఫీసుకు నిప్పు అంటుకుంది. దూరంనుంచి మంటల్ని ఆర్పేకారు వస్తూన్న గంటల చప్పుడు వినిపించింది. వెంటనే ఆ మంటల్లోకి ఎలా దూకాడో దూకాడు సాంబయ్య.

పొగ చుట్టుముట్టేసింది.

కళ్ళనిండా పొగ చుట్టూ కాలిపోతూన్న కాగితాలు.

దగ్గరౌతున్న మంటలు శరీరాన్ని తాకుతున్నాయి. బయట జనానికి సాంబయ్య కనిపించక "అయ్యో..... అయ్యో" అంటూ అరుస్తున్నారు. ఫైరు సర్వీసు వాళ్ళ కారు దగ్గరికి వచ్చేస్తోంది. గంటలు సమీపంగా వినిపిస్తున్నాయి.

దగ్గరౌతున్న మంటల్ని లెఖ్ఖచెయ్యకుండా సాంబయ్య ఫైల్సన్నీ వెతికేస్తున్నాడు. ఎన్ని వెతికినా, తనకి కావలసిన ఫైలు దొరకటం లేదు. ఫైరు సర్వీసు కారు తాలూకు గంటలు దగ్గరగా వినిపిస్తున్నాయి. చుట్టూ పొగ కమ్మేస్తోంది. మంటలు మరీ దగ్గరకు వచ్చేస్తున్నాయి. కంగారుతో వణికిపోతున్న చేతుల్తో ప్రతిఫైలూ తీసి చూస్తున్నాడు – విసుగుతో మంటల అవతలకి వాటిని విసిరేస్తున్నాడు – గంటలు – ఫైల్సు – పొగ – మంటలు – వెతుకుతున్నాడు. ఓ పక్క నుంచి మంటలు కాల్చేస్తున్నా వెతుకుతూనే ఉన్నాడు. బీరువాలు – సొరుగులు – అలమార్లు, హమ్మయ్య! కావలసిన ఫైలు దొరికింది!

అదికనక వెలుగులోకి వచ్చిందా. గవర్నమెంటుకి తన రెండు లక్షలు ఇచ్చుకోవాలిసి వస్తుంది. పైగా కంట్రాక్టులలో చేసిన మోసానికి జైలు కెళ్ళినా వెళ్ళొచ్చు. అలా కాక అది మంటల్లోకి వెళ్ళిందా, ఆ డబ్బుతోపాటు సంఘంలో తనకి మర్యాదా గౌరవం కూడా మిగుల్తాయి. సాంబయ్య ఒక్క క్షణంకూడా ఆలశ్యం చెయ్యలేదు. ఫైలుతో బాటు సాంబయ్య కూడా ఆ మంటల్లో కాలిపోయి ఉండును ఫైరు సర్వీసు వాళ్ళు కనక సమయానికి ఆదుకోకపోతే.

ధైర్యంగా మంటల్లోకి ఉరికి, కొన్ని ఫైల్సయినా బయటకు విసిరేసిన సాంబయ్య చొరవకూ, సేవా నిరతికీ జోహార్లు అర్పిస్తూ, అతణ్ణి ప్రత్యేకంగా అభినందించ

డానికి హాస్పిటల్‌కి జిల్లా కలెక్టరు స్వయంగా వచ్చాడు. ఆ అభినందనకి జవాబుగా "ఆ...... అదేం ఉందిలెండి!" అంటూ నీరసంగా నవ్వాడు సాంబయ్య.

అతని నిరాడంబరత్వానికి ఆశ్చర్యంతో అంతా ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ తర్వాత అతణ్ణి చూడడానికి వచ్చిన వర్కర్లలో "మేం రేపిన మంటలు చివరికి మిమ్మల్ని కాల్చాయా" అన్నారు.

"నామాటకేంలెండి! రెండు రోజుల్లో కోలుకుంటాను. యింతకీ ఆ పోలీసులు వాళ్ళని వదిలారా?"

దాంతో వాళ్ళ రక్తం వేడెక్కింది.

"వాళ్ళో పట్టాన వదుల్తారుటండి! ఇంక లాభం లేదురా అనేటంత వత్తిడి తీసుకురావాలి వాళ్ళమీద .... అప్పుడు కానీ" అన్నాడు వాళ్ళల్లో ఒకడు, గట్టిగా పళ్ళతో కింది పెదివి కొరుకుతూ....

సాంబయ్య వెంటనే తొ్రుపడుతూ ప్రాధేయపూర్వకంగా "ఒత్తిడి అంటున్నారు! మీకు పుణ్యం ఉంటుంది. రైళ్ళూ బస్సులు ఆపి ప్రజాజీవనం మాత్రం స్తంభింపజేయకండి" అన్నాడు.

సరిఘ్గా మర్నాడు అదే జరిగింది.

ఊళ్ళో ఉద్రిక్తత పెరిగింది.

పొరుగూరు నుంచికూడా పోలీసుల్ని రప్పించాల్సి వచ్చింది. ఇటు ప్రజలలోనూ, అటు పోలీసులలోనూ పట్టుదలలు పెరిగాయి.

రోజూ ఏదో ఒక అల్లరి!

ఎక్కడో అక్కడ లాఠీచార్జీ!

ఊరంతా అల్లకల్లోలంగా తయారైంది. ఒక్క క్షణంకూడా శాంతంగానూ, స్తిమితంగానూ ఉండడం లేదు. ఏ నిముషాన్ని ఏం అవుతుందో - పరిస్థితి అంతా అస్తవ్యస్తంగానూ, భయంకరంగానూ మారిపోయింది!

వారం రోజులపాటు ఆ ఊళ్ళో ప్రభుత్వం లేదు.

సాంబయ్య లారీల్ని అటకాయించ ఆఫీసర్లూ లేరు.

ఎవర్నీ బతిమాలక్కర్లేదు. లంచాలివ్వక్కర్లేదు. స్తిమితంగా ఉన్నప్పుడు లక్షరూల్సూ, పది లక్షల ఇబ్బందులూను. ఇప్పుడవేం లేవు. పంచదారని తక్కువ

ధరకి గవర్నమెంటుకే అమ్మాల్సిన బాధలేదు. ఇష్టం వచ్చిన వాళ్ళకి ఇష్టం వచ్చిన ...కి అమ్మొచ్చు.

వందలకొద్దీ బస్తాలు లారీలమీద వెళ్ళిపోతున్నాయి.

ఏణ్ణర్థంనుంచి గోడౌన్లలో పేరుకుపోయిన సరుకుఅంతా క్షణాలమీద అమ్ముడయిపోయి, డబ్బువచ్చి చేతిలో పడుతోంది. డబ్బు పుష్కలంగా రావడంవల్ల మరో రెండు రూపాయలు వర్కర్లకి ఎక్కువ ఇవ్వగలుగుతున్నాడు సాంబయ్య. వర్కర్లకి కూడా ఇది బాగానే అనిపించింది. ఫేక్టరీలో పొద్దుటినుంచి రాత్రిదాకా నడ్డివంచి కష్టపడక్కర్లేదు. సరదాగా నినాదాలు చేస్తూ, కాస్సేపు రాళ్ళు విసిరినట్టూ రైళ్ళు ఆపినట్టూ ఆడుకుంటే, ఇట్టే చీకటిపడిపోతోంది. మామూలుగా రోజుకూలీ వచ్చేస్తోంది. ఇంకా ఒకటి రెండు రూపాయలు ఎక్కువే ముడుతున్నాయి. ఇదే బాగుంది అనుకున్నారు వర్కర్లు. అడుగడుగునా ప్రభుత్వం పెట్టే ఆంక్షలనుంచీ, ఆరళ్ళనుంచీ ఈ కొద్దిరోజులైనా విశ్రాంతి లభించిందికదా అని ప్రజలంతా హాయిగా, స్వేచ్ఛగా గాలి పీల్చుకోసాగారు.

సాంబయ్య హాస్పిటల్ నుంచి డిస్‌ఛార్జి అయే రోజుకికూడా పరిస్థితి అల్లర్లూ – అలజడితో ఉద్రిక్తతగానే ఉంది.

సరిగ్గా ఆ రాత్రే, స్టేషనుకి నాలుగు ఫర్లాంగుల అవతల లెవెల్ క్రాసింగ్ దగ్గర, భయంకరమైన శబ్దంతో గూడ్సుబండి పడిపోయింది. దూరంగా తారు రోడ్డు మీద నిలబడి ఉన్న లారీలలోంచి, పాతిక ముప్పైమంది జనం అయితే, గబగబా పలుగులతోటీ, గునపాలతోటీ దిగి, వేగన్ల తలుపులు విరగ్గొట్టసాగారు. యాక్సిడెంటు సంగతిని విజిల్స్ ఊదుకుంటూ, బ్యాటరీ లైట్లు వేసుకుంటూ ఆ చీకటిలో తడుము కుంటూ పోలీసులు వచ్చేసరికల్లా, నాలుగు వేగన్లు ఖాళీ అయిపోయి, సరుకులతోటీ, మనుషులతోటీసహా లైట్లులేని పాతిక లారీలైతే చీకటిలోకి దూసుకపోయాయి.

ఆ రాత్రే లారీలు వేసుకుని ఇతర రాష్ట్రాలకి వ్యాపారం పనిమీద పోయాడన్న సాంబయ్య తిరిగి వారం రోజులకి కాని రాలేదు. అతనితోపాటు వచ్చిన లారీడ్రైవర్లూ, లారీలో పనిచేసే మనుష్యులూ కొత్త బట్టల్లో నిగనిగలాడుతూ, గలగల్లాడుతూన్న జేబుల్తో హుషారుగా కనిపించారు తక్కిన వర్కర్లకి.

ఆ సాయంత్రం వర్కర్ల నందర్నీ సమావేశం చేసి ఆ సభలో "ఈ పది పదిహేడు రోజులనుంచీ ఫేక్టరీ పని స్తంభించిపోయింది. ఫేక్టరీలో నిలవలు కూడా అయిపోయాయి. ఇంక రేపటినుంచి ఫేక్టరీ పనిచెయ్యకపోతే బోలెడు నష్టం వస్తుంది. మీకూ ఉపాధి ఉండదు. పైగా ఇలా రోజులకొద్దీ ఫేక్టరీలు పనిచెయ్యకపోతే ఎంతో

ఉత్పత్తి ఆగిపోయి జాతీయ ఆదాయం కుంటుపడుతుంది. అందువల్ల రేపటినుంచి పనిలోకి వచ్చెయ్యండి. మీ పెంచిన జీతాలూ, బోనస్‌లూ కింద ఇదిగో మీ ఎదురు గుండా ఇప్పుడే దెబ్బయి అయిదు వేలకి చెక్కు మేనేజరు గారికిస్తున్నాను. దీంతో మీ కోరికలు తీరాయి కనుక, ఇతర పనులు కూడా పూర్తి అయ్యాయి కనుక, రేపటి నుంచి మామూలుగా పనిలోకి వచ్చేయండి" అంటూ ఓ సుదీర్ఘమైన ఉపన్యాసంవినే సరికి వర్కర్లంతా సంతోషంతో తబ్బిబ్బయిపోయారు. ఆ ఆనందంలో వాళ్లు విప్లవం వర్ధిల్లాలి అనే నినాదం మరిచిపోయారు. పైగా ఆ సమయంలో అదంత అవసరంగా కనిపించలేదు. అందుకే దాని స్థానంలో అంతా ఒక్క కంఠంతో "సాంబయ్య గారికి జై!" అంటూ కొత్త నినాదం చేశారు.

ఆ రాత్రి తన ముగ్గురు పార్టనర్స్‌కీ ఏర్పాటు చేసిన పార్టీలో సాంబయ్య స్కాచ్ విస్కీని మూడూ గ్లాసులలోనూ పోస్తూ. "అంతాస్తబ్దుగా స్థిమితంగా ఉంటే. రకరకాల పన్నులూ-లంచాలూ లేవీలూను. ఒడిదుడుకులులేని రోజుల్లో ఇవన్నీ మనం చచ్చినట్లు ఇచ్చుకోవలసిందే. ఇన్నీ ఇచ్చుకోగా ఇంక మనకి మిగిలే దెంత? మనిషికి చచ్చు పదివేలు? అంతేగాక ఇందులో మళ్ళీ మా కోరికలో, బోనసులో అంటూ వర్కర్ల ఏడుపు ఒకటి. నిత్యం వాళ్ళకీ, మనకీ తగాదాలు! అవునా? ఇలా గవర్నమెంటు పెట్టే షరతులకి తలవంచి, కొంచెం కొంచెం లాభాలు పంచుకుంటూ, నిత్యం వర్కర్లతో ఘర్షణపడుతూ ఉండడం కంటే, ఇంత మంది వర్కర్ల ప్రజాశక్తిని మనం తెలివిగా ఈ పదిహేను రోజులూ వాడుకోవడంతో ఎంత లాభం పొందామో చూడండి. గోడౌనులో మ్రగ్గుతూన్న పంచదారని ఫ్రీ మార్కెట్‌లో హాయిగా ఎక్కువ ధరకి అమ్ముకున్నాం. పని లేకుండా పడిఉన్న లారీలకు చేతినిండా పని కల్పించాం. పుష్కలంగా అభిమానాన్నికూడా సంపాదించాం. వాళ్ళకోరికలన్నీ ఎప్పటికేనా తీర్చవలసినవే కదా? అవా తీర్చాం - పోగా మనం ఇంకో డబ్బై వేలు మిగుల్చుకున్నాం. వాటాకి ఇరవై వేలు కనీసం వచ్చేలాగ - ఊ..... ఇప్పుడు చెప్పండి .... పరిస్థితులన్నీ మామూలుగా ఉండి ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా నడుస్తూ ఉంటే, యిది అంతా మనకి సాధ్యం అయిఉండేదా?" అన్నాడు.

"కాదు! ఒక్కనాటికి కాదు!"

"అయినా పంచదార వ్యాపారం ఏం వ్యాపారం? చేస్తే ఎన్నికలు, దేశసేవ వంటి వ్యాపారాలు చెయ్యాలి - అవి అంతకంటే నయం - వాటికంటే కూడా ఈ విప్లవం అనేది మరీ మంచి వ్యాపారం - ఏమంటారు?"

"నిజం! నిజం!"

"అందువల్ల ఏడాదికి ఒక్కమాటైనా...."

"ఇలాంటి విప్లవం వస్తూండాలి!" అంటూ సాంబయ్య వాక్యాన్ని పూర్తి చేశారు రాఘవరావు, రంగనాథం, మహాలింగమూను.

విజయగర్వంతో చిరునవ్వునవ్వి వాళ్ళకి గ్లాసులు అందించి తన గ్లాసుని ఎత్తుగా ఎత్తుకుని "మరైతే టోస్ట్ చెప్పండి" అన్నాడు సాంబయ్య.

"విప్లవం వర్ధిల్లాలి" అన్న వాళ్ళ నినాదంలో నాలుగు గ్లాసులు "క్లక్" మంటూ చేసిన మనోహరమైన శబ్దం, మత్తుగా కలిసిపోయింది - వైట్ మనీలో బ్లాక్‌మనీ, అధికారంలో అవినీతి, జాతీయ నాయకుల్లో దొంగల నాయకుడూ, అందంగా తమాషాగా, షోగ్గా కలిసిపోయినట్టు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 18-6-1978)

*